క్లుప్తంగా

ఉత్తమ సేవా పురస్కార గ్రహీతలకు సత్కారం



లక్ష్మీనారాయణ, వెంకట రమణలను సన్మానిస్తున్న వైఎస్సార్‌ సీపీ నాయకులు

అన్నవరం: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ నెల 15న ఉత్తమ సేవా పురస్కారాలు పొందిన రత్నగిరి దేవస్థానం సీనియర్‌ అసిస్టెంట్‌ పోల్నాటి లక్ష్మీనారాయణ, బందారు వెంకటరమణలను స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం ఘనంగా సత్కరించారు. పార్టీ నేత సరమర్ల మధుబాబు ఆధ్వర్యంలో వారిని శాలువా, పూలమాలతో సత్కరించారు. పార్టీ నాయకులు బలువు హరిబాబు, గణేశుల బాబ్జీ, బీఎస్‌పీ ప్రసాద్‌, రాయి శ్రీనివాస్‌, దోమాడ రాంబాబు, పెద్దింటి లక్ష్మణ్‌ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పరదేశమ్మతల్లి జాతర

తుని రూరల్‌: కొత్త సూరవరంలో కొలువైన పరదేశమ్మ 40వ జాతర మహోత్సవాలు వైభవంగా జరిగాయి. బుధవారం రాత్రి జాతర, గురువారం అమ్మవారి తీర్థం నిర్వహించారు. పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు. పరదేశమ్మ బాలభక్త వినాయక సంఘం (ఆలయ కమిటీ) ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జాతరోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు క్యూలైన్ల ద్వారా అమ్మవారిని దర్శించి, పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు నల్లల వరహాలరావు, తర్రా దొరబాబు, కోశాధికారి ప్రగడ రమేష్‌, చవితిన సన్యాసిరావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అన్నసమారాధన

ప్రత్తిపాడు: స్థానిక శ్రీకృష్ణుని ఆలయం వద్ద గురువారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. కృష్ణాష్టమి ముగింపు వేడుకల్లో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ప్రత్తిపాడు, సమీప గ్రామాల ప్రజలు పాల్గొని అన్న ప్రసాదాలను స్వీకరించారు.

విద్య, పరిశోధనపై శిక్షణ

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో గురువారం సాధనాలు, విద్య, పరిశోధనపై శిక్షణ తరగతులు నిర్వహించినట్టు డిప్యూటీ ప్రో చాన్సలర్‌ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఏఐ సాధనాలు, కంప్యూటింగ్‌ రంగంలో ప్రాథమిక అంశాలను రీసోర్స్‌పర్సన్‌ ఎం.వెంకటేష్‌ వివరించారు. ఐదు రోజుల విద్యార్థులకు శిక్షణ ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైస్‌ చాన్సలర్‌ ఎంబీ శ్రీనివాస్‌, ప్రొ వైస్‌ చాన్సలర్‌ ఎస్‌.రమాశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

క్షయ నివారణలో భాగస్వాములు కండి

గోకవరం: టీబీ (క్షయ) వ్యాధి నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కొత్తపల్లి ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి డాక్టర్‌ నిఖిత పిలుపునిచ్చారు. మండలంలోని కొత్తపల్లిలో గురువారం ఇంటెన్సిఫైడ్‌ టీబీ ముక్త్‌ భారత్‌ అభియాన్‌ నిర్వహించారు. డాక్టర్‌ నిఖిత మాట్లాడుతూ క్షయ వ్యాధి పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. దగ్గు, ఇతర టీబీ లక్షణాలతో బాధపడుతున్న వారిని గుర్తించి వారికీ అవగాహన కల్పించాలని సూచించారు. క్షయ నివారణపై ప్రతిజ్ఞ చేయించారు. 108 మందిని పరీక్షించి వారిలో 31 మంది నుంచి కళ్లె పరీక్షకు సాంపిల్స్‌ సేకరించారు. స్థానిక ఆదర్శ ఫార్మసీ కళాశాలలో విద్యార్థులకు టీబీ వ్యాధిపై ఎస్టీఎస్‌ శ్రీనివాస్‌, సీహెచ్‌ఓ శ్రావ్య అవగాహన కల్పించారు.

తాళ్లూరు లిఫ్ట్‌ మరమ్మతులకు రూ.52 కోట్లు మంజూరు

జగ్గంపేట: నియోజకవర్గంలోని గండేపల్లి, జగ్గంపేట మండలాల్లో 31 వేల ఎకరాలకు సాగునీరు అందించే తాళ్లూరు ఎత్తిపోతల పథకం మరమ్మతులకు ప్రభుత్వం రూ.52 కోట్లు మంజూరు చేసిందని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలిపారు. జగ్గంపేటలో గురువారం రాత్రి ఆయన విలేకర్లతో మాట్లాడారు. పుష్కర ఎత్తిపోతల పథకానికి అనుబంధంగా ఉన్న తాళ్లూరు ఎత్తిపోతల పథకం పైపులైన్లు పగిలిపోవడంతో దాని ద్వారా సాగునీరు అందించే అవకాశం లేకుండా పోయిందన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లిగా ప్రభుత్వం రూ.52 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు.

తుపానుపై అప్రమత్తంగా ఉండాలి

తొండంగి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుపానుగా మారే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి శ్రీధర్‌ సూచించారు. స్థానిక మండల పరిషత్‌ కార్యాలయ సమావేశ హాలులో గురువారం అధికారులతో తుపాను అప్రమత్తతపై సమీక్షించారు. తీరప్రాంత గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు శిథిలావస్థకు చేరిన ఇళ్లలో నివసించకుండా సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. తుపాను పునరావాస కేంద్రాల్లో ఆహారం, వైద్యం తదితర అన్ని సౌకర్యాలు సిద్ధం చేసుకోవాలన్నారు.

దివ్యాంగులపై కక్ష

- పింఛన్ల తొలగింపునకు కుట్ర
- వైకల్యం నిర్ధారణకు మరో పరీక్ష
- మూడు నియోజకవర్గాల్లో 2664 మందికి నోటీసులు



తునిలో అధికారులకు పునఃపరిశీలన దరఖాస్తులు అందజేస్తున్న దివ్యాంగులు

తుని రూరల్‌: సూపర్స్‌ సిక్స్‌ హామీలతో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం అర్హులైన దివ్యాంగులకు కొత్త పింఛన్లు మంజూరు చేయకపోగా అనర్హులంటూ వేలాది మందికి నోటీసులు జారీ చేసింది. ఎన్నో సంవత్సరాలుగా పొందుతున్న పింఛన్లు రద్దవుతున్నాయన్న నోటీసుల సారాంశంతో దిక్కుతోచని స్థితిలో దివ్యాంగులు ఉన్నారు. సచివాలయాలు, ఎంపీడీఓ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత దివ్యాంగుల పింఛను రూ.3 వేలు నుంచి రూ.6 వేలకు పెరిగిందన్న సంతోషం మూన్నాళ్ల ముచ్చటగా మారింది. పలువురికి పింఛను నిలిపివేతపై నోటీసులు జారీ చేయడంతో తమ పింఛన్‌ పునరుద్ధరించేందుకు అర్హతలు పునఃపరిశీలన చేయాలని కోరుతూ వేలాది మంది దరఖాస్తులు చేస్తున్నారు. తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో పది మండలాలు, రెండు పట్టణాల్లో 2664 మంది పింఛన్లు తొలగిస్తున్నట్టు అధికారులు గడిచిన రెండు రోజులు నోటీసులు ఇచ్చారు. దివ్యాంగుల పింఛన్ల కోత పూర్తయితే ఆ తర్వాత ఓఏపీ, ఒంటరి మహిళ, వితంతు, తదితర పింఛన్ల పరిశీలన జరుగుతాదన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

నోటీసులు ఇలా..

నాలుగు నెలలు కింద పైలెట్‌ ప్రాజెక్టుగా తుని మండలం రేఖవానిపాలెంలో ప్రత్యేకంగా నియమించిన ఉన్నత అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి దివ్యాంగ పింఛన్‌దారులను సమగ్రంగా పరిశీలన చేశారు. అప్పుడే ఆందోళన చెందిన పింఛన్‌దారులకు రోజులు, వారాలు, నెలలు గడిచిన ఎటువంటి సమాచారం ఇవ్వలేదు. పైలెట్‌ ప్రాజెక్టు నివేదికల ఆధారంగా ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా దివ్యాంగుల పింఛన్ల రద్దుకు నోటీసులు జారీ చేసింది. ఇందులో ప్రధానంగా అనర్హులు, 40 శాతం లోపు వైకల్యం ఉన్న దివ్యాంగులు, తాత్కాలిక ధ్రువీకరణ పత్రాలు, డిజిటల్‌ సంతకాలు లేకపోవడాన్ని కారణాలుగా చూపించారు. అర్హత ఉంటే సంబంధిత సర్టిఫికెట్లతో (రీవెరిఫికేషన్‌) పునఃపరిశీలన చేయించుకునేందుకు అవకాశం కల్పించారు. పునఃపరిశీలన దరఖాస్తుతో పాటు ఇచ్చే సర్టిఫికెట్లను ఎంపీడీఓలు సమగ్రంగా పరిశీలించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్‌ చేయాల్సి ఉంది. ఆ తర్వాత మరోసారి సదరం సర్టిఫికెట్లకు వైద్య పరీక్షలకు వెళ్లాల్సి ఉంది. ఈ ప్రక్రియ పూర్తయ్యే వరకూ ఇప్పటికే పింఛన్లు పొందుతున్న దివ్యాంగులకు ఏమవుతుందోనన్న కలవరం తప్పదు.

మూడు నియోజకవర్గాల్లో మండలాల వారీగా జారీ చేసిన నోటీసుల వివరాలు

మండలం పేరు	జారీ చేసిన నోటీసుల సంఖ్య
తుని	572
కోటనందూరు	296
తొండంగి	250
రౌతులపూడి	38
శంఖవరం	46
ఏలేశ్వరం	98
ప్రత్తిపాడు	511
కిర్లంపూడి	124
జగ్గంపేట	532
గండేపల్లి	133
తుని అర్బన్‌	57
ఏలేశ్వరం అర్బన్‌	7
మొత్తం	2664

మానసిక క్షోభ



నా వయస్సు 36 సంవత్సరాలు. పుట్టికతో మానసిక వైకల్యం కావడంతో అవివాహితగా ఉన్నాను. తల్లిదండ్రుల వద్దే ఉంటున్నాను. సదరం సర్టిఫికెట్‌లో వైకల్యం 75 శాతం ఉందని ధృవీకరించారు. 2010 నుంచి దివ్యాంగుల పింఛన్‌ తీసుకుంటున్నాను. పింఛన్‌ డబ్బులతో ధైర్యంగా జీవిస్తున్నాను. నా పింఛన్‌ రద్దు చేసినట్టు సచివాలయ సిబ్బంది నోటీసు ఇచ్చారు. పింఛన్‌ పునరుద్ధరించాలి.

– **తమరాన హైమ**, మానసిక దివ్యాంగురాలు, తాళ్లూరు

నడవలేని పరిస్థితి



పదేళ్లుగా ఊతకర్ర ఉంటేనే కాని నడవలేని పరిస్థితి. సదరం సర్టిఫికెట్‌లో 87 శాతం దివ్యాంగుడిగా వైద్యులు గుర్తించారు. 2015 నుంచి దివ్యాంగ పింఛన్‌ తీసుకుంటున్నాను. ఇప్పుడు నా వయస్సు 59 సంవత్సరాలు. నడవలేని పరిస్థితుల్లో ఉన్న నాకు పింఛన్‌ రద్దు చేసినట్టు అధికారులు నోటీసు ఇచ్చారు. నాకు పింఛనే జీవనాధారం. నా పరిస్థితి చూసి పింఛన్‌ను కొనసాగించాలి.

– **గండి తలుపులయ్య**, దివ్యాంగుడు, తాళ్లూరు

రీవెరిఫికేషన్‌కు అవకాశం



అర్హులందరికీ న్యాయం చేస్తాం. నోటీసులు ఇచ్చినవారందరికీ రీవెరిఫికేషన్‌కు అవకాశం ఉంది. దరఖాస్తుతో పాటు సంబంధిత పత్రాలు అందజేస్తే ఆన్‌లైన్‌ చేసి ఉన్నత అధికారుల పరిశీలనకు పంపిస్తాం. అవసరమైతే రీవెరిఫికేషన్‌ చేస్తారు. ఈ అవకాశాన్ని నోటీసులు అందుకున్న వారు సద్వినియోగం చేసుకోవాలి. మా కార్యాలయంలో హెల్ప్‌ డెస్క్‌ ఏర్పాటు చేశాం.

– **కె.సాయినవీన్‌**, ఎంపీడీఓ, తుని మండలం

పి.నాయకంపల్లి సర్పంచ్‌కు తోట పరామర్శ



రాజమహేంద్రవరంలో సర్పంచ్‌ అన్నపూర్ణను పరామర్శిస్తున్న మాజీ మంత్రి తోట నరసింహం, రాంజీ

గండేపల్లి: మండలంలోని పి.నాయకంపల్లి గ్రామ సర్పంచ్‌ మలిరెడ్డి అన్నపూర్ణ అనారోగ్యంతో రాజమహేంద్రవరంలోని సాయి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా మాజీ మంత్రి, వైఎస్సార్‌ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ తోట నరసింహం గురువారం ఆమె పరామర్శించారు. ఆరోగ్యంపై ఆరా తీశారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. ఆయన వెంట పార్టీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట రాంజీ, పార్టీ జగ్గంపేట మండల అధ్యక్షుడు రావుల గణేష్‌ రాజా, సమ్మిట మోహన్‌, తదితరులు ఉన్నారు.

గోకవరం: జగ్గంపేట ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు కింద పడి తీవ్రంగా గాయపడిన రేవాడి రాజేశ్వరిని వైఎస్సార్‌ సీపీ జగ్గంపేట ఇన్‌చార్జి, మాజీ మంత్రి తోట నరసింహం పరామర్శించారు. రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమెను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు ఆయన సూచించారు. ఆయన వెంట పార్టీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట రాంజీ, నాయకులు సమ్మెటి మోహన్‌ తదితరులు ఉన్నారు.

బాబు షూరిటీ-మోసం గ్యారంటీని విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ముద్రగడ గిరిబాబు

కిర్లంపూడి: గ్రామాల్లో నిర్వహిస్తున్న బాబు షూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్‌ ముద్రగడ గిరిబాబు పార్టీ శ్రేణులకు సూచించారు. కిర్లంపూడిలోని తన నివాసంలో గురువారం పార్టీ మండల కన్వీనర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో బూత్‌ కమిటీలు, గ్రామ కమిటీలను ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తూతూమంత్రంగా అమలు చేసి గొప్పగా ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్లు శిడిగం వెంకటేశ్వరరావు, నరాల శ్రీను, గొల్లపల్లి సురేష్‌, రామిశెట్టి నాని, వాసిరెడ్డి భాస్కర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధితో చీడపీడల నివారణ



అరెంపూడిలో రైతులతో మాట్లాడుతున్న ఏఓ గాంధీ

శంఖవరం: విత్తన శుద్ధితో పంట తొలిదశలో ఆశించే చీడపీడలను నివారించవచ్చని మండల వ్యవసాయాధికారి పి.గాంధీ పేర్కొన్నారు. మండలంలోని అరెంపూడిలో గురువారం పొలం పొలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ విత్తనశుద్ధి ప్రాధాన్యత, ఎరువుల యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. భూసార పరీక్షలు, నీటి నాణ్యత పరీక్షల అవశ్యకతను రైతులకు తెలియజేశారు. అనంతరం వరి నారుమడులను పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకుడు జగదీష్‌ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



నీలాద్రిరావుపేటలో ఫాగింగ్‌ చేస్తున్న పంచాయతీ కార్మికుడు

కిర్లంపూడి: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని సామాజిక కార్యకర్త పాటంశెట్టి సూర్యచంద్ర అన్నారు. మండలంలోని తామరాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సర్పంచ్‌ తోట అయ్యన్న అధ్యక్షతన స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వచ్ఛ గ్రామ సాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు

గండేపల్లి: ప్రజారోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు వైఎస్సార్‌ సీపీ నాయకుడు, నీలాద్రిరావుపేట గ్రామ సర్పంచ్‌ ములంపాక సురేష్‌ తెలిపారు. గ్రామంలో దోమల నివారణకు గురువారం ఫాగింగ్‌ చేశారు. ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ పనులను సర్పంచ్‌ పరిశీలించారు.

అంగన్‌వాడీ కార్యకర్తల నిరసన



కోటనందూరులో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

తుని: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ పట్టణశాఖ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు గురువారం నిరసన చేపట్టారు. ఎఫ్‌ఆర్‌ఎస్‌ను రద్దు చేయాలని, కనీస వేతనం అమలు చేయాలని, మినీ అంగన్‌వాడీ కేంద్రాలను అంగన్‌వాడీ కేంద్రాలుగా గుర్తించాలని, వర్కర్లందరికీ సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని డిమాండ్‌ చేశారు. అనంతరం తహసీల్దార్‌ శివప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ మండల కన్వీనర్‌ ఎస్‌.శ్రీనివాస్‌, తుని ప్రాజెక్టు కార్యదర్శి వై.ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్లు నెరవేర్చాలని నిరసన

కోటనందూరు: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ స్థానిక తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు గురువారం నిరసన చేపట్టారు. ఎఫ్‌ఆర్‌ఎస్‌ రద్దు చేయాలని, మినీ అంగన్వాడీ కేంద్రాలను, అంగన్వాడీ కేంద్రాలుగా గుర్తించాలని, కనీస వేతనం అమలు చేయాలని నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్‌ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి షేక్‌ పద్మ పాల్గొన్నారు.

తొండంగి: తమకు జీతాలు పెంచాలని డిమాండ్‌ చేస్తూ మండలంలోని అంగన్‌వాడీలు స్థానిక తహసీల్దార్‌ కార్యాలయం వద్ద గురువారం నిరసన తెలిపారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తమకు ఉద్యోగ భద్రత కల్పించడంతో జీతాలు పెంచాలని, ఉద్యోగులకు అందించే అన్ని పథకాలను వర్తింపజేయాలని డిమాండ్‌ చేశారు. అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్‌ గౌరవాధ్యక్షులు బి. మేరీ సమాధానం,అధ్యక్షురాలు నేమాల రాణి, సుబ్బలక్ష్మి, బి.శాంతి కుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: స్థానిక తహసీల్దార్‌ కార్యాలయం వద్ద గురువారం అంగన్‌వాడీ వర్కర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ యూనియన్‌ ప్రాజెక్టు కార్యదర్శి అల్లాడి లక్ష్మి, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి రొంగల ఈశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారులకు పోషకాహారాన్ని సకాలంలో అందించడం లేదని ఆరోపించారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌ ఎం.సూర్యప్రభకు అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్‌ ప్రాజెక్టు సంఘ నాయకులు మరియ, పద్మ, ఇంద్రాణి, అచ్చిరాజు, నందిని, అప్పలనర్స, వెంకటలక్ష్మి, గనిలక్ష్మి, జయ తదితరులు పాల్గొన్నారు.

నేడు జాతీయస్థాయి వర్క్‌షాప్‌

ఏలేశ్వరం: పట్టణంలో శుక్రవారం జాతీయస్థాయి వర్క్‌షాప్‌ నిర్వహించనున్నట్టు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ డి.సునీత తెలిపారు. స్థానిక డిగ్రీ కళాశాలలో గురువారం ఆమె విలేకర్ల సమావేశం నిర్వహించారు. ప్రధానమంత్రి ఉచ్చతర శిక్షా అభియాన్‌లో భాగంగా స్థానిక లారీ యూనియన్‌ కార్యాలయంలో ఎంట్రీవిష్టా అనే అంశంపై జాతీయస్థాయి వర్క్‌షాప్‌ నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు ఈ వర్క్‌షాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగ్రాం మేనేజర్‌ ప్రగడ ప్రయాగమూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టుకు వ్యతిరేకంగా ధర్నా



ప్రత్తిపాడులో ఎక్సైజ్‌ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాజవరం గ్రామస్తులు

ప్రత్తిపాడు: గ్రామ ప్రముఖుడిని అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ ప్రత్తిపాడు ఎక్సైజ్‌ సర్కిల్‌ కార్యాలయం వద్ద శంఖవరం మండలం రాజవరం గ్రామస్తులు గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు జనతా పార్టీ అధ్యక్షుడు పెద్దింశెట్టి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ శంఖవరం మండలం గౌరంపేట శివారు రాజవరంలో ఎక్సైజ్‌ అసిస్టెంట్‌ కమిషనర్‌ వి.రేణుక తన సిబ్బందితో సారా స్థావరాలపై దాడులు చేశారన్నారు. నిందితులను వదిలిపెట్టి ఇంటిలో ఉన్న మోసర సోమరాజును కులం పేరుతో దూషించి అరెస్టు చేశారని ఆరోపించారు. అక్రమంగా అరెస్టు చేసి, కులం పేరుతో దూషించిన ఎక్సైజ్‌ అసిస్టెంట్‌ కమిషనర్‌ రేణుక, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. అనంతరం ఎక్సైజ్‌ సూపరింటెండెంట్‌ ఎం.కృష్ణకుమారికి వినతిపత్రం అందజేశారు.

నేడు విద్యుత్‌ అంతరాయం

తుని రూరల్‌: విద్యుత్‌ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు గ్రామాల్లో విద్యుత్‌ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌ కో ఆపరేషన్‌ ఎగ్జిక్యూటివ్‌ ఇంజినీర్‌ డి.వీరభద్రరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని కొలిమేరు, ఎన్‌.సూరవరం, ఎస్‌ఎస్‌వీ నగరం, కూటయ్యపాలెం, ఎస్‌బీ పేట, సీహెచ్‌ అగ్రహారం, దొండవాక, బీఎస్‌ పేట, రాపాక, కేఓ మల్లవరం, లోవ కొత్తూరు, కె.వెలంపేట గ్రామాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటలు వరకు విద్యుత్‌ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

గోకవరం: మండలంలోని మల్లవరం ఫీడర్‌ పరిధిలో కొత్తలైన్‌ ఏర్పాటు చేస్తున్నందున శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పలు గ్రామాల్లో విద్యుత్‌ సరఫరా నిలిచిపోతుందని విద్యుత్‌శాఖ ఈఈ జేపీబీ నటరాజన్‌, మండల ఏఈ వైవీఎస్‌ సుబ్రహ్మణ్యంలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో కొత్తపల్లి, రాజుపాలెం, కామరాజుపేట, సూదికొండ, గంగంపాలెం, ఠాకూరుపాలెం, జగన్నాథపురం, మల్లవరం, భూపతిపాలెం, శివరామపట్నం, ఉమ్మెత్త గ్రామాలకు విద్యుత్‌ సరఫరా ఉండదన్నారు. ఫోక్స్‌పేట ఫీడర్‌పై చెట్లు తొలగిస్తున్నందున కృష్ణునిపాలెం, కొత్తూరు, చిన్నూరు, రామన్నపాలెం, రామాంజపురం గ్రామాల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్‌ సరఫరా నిలిచిపోతుందన్నారు.

నేడు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

గోకవరం: మండలంలోని తంటికొండ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్‌ బద్దిరెడ్డి అచ్చన్నదొర గురువారం తెలిపారు. శ్రావణమాసంలోని చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని ఆలయంలో అమ్మవారికి ఉదయం 6 గంటలకు ప్రత్యేక అభిషేకాలు, తొమ్మిది గంటలకు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తామని చెప్పారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

ప్రత్తిపాడు రూరల్‌: మండలంలో ఒమ్మంగిలో వేంకటేశ్వరస్వామి కల్యాణం గురువారం వైభవంగా జరిగింది. టీటీడీ శ్రీవాణి ట్రస్ట్‌ ఆర్థిక సాయంతో సమరసత సేవా ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆలయంలో స్వామివారి వార్షిక కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పుర వీధుల్లో ఊరేగించారు. అనంతరం శ్రీపుష్పయాగం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కోనేరులో కలుషిత నీరు తొలగించాలి



బలరామపురం కోనేరు వద్ద ధర్నా చేస్తున్న గ్రామస్తులు

రౌతులపూడి: మండలంలోని బలరామపురం కోనేరులో వేలాది చేపలు మృత్యువాత పడ్డాయి. ఈ నేపథ్యంలో చెరువులోని నీరు కలుషితమైందని, వెంటనే ఆ నీటిని తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ మేరకు గురువారం కోనేరు వద్ద రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. కోనేరులోని రెండు మంచినీటి బావుల్లో నీటిని గ్రామస్తులు తాగునీరుగా వాడుతున్నారు. చెరువులోని కలుషితమైన నీరు బావుల్లోకి చేరి అంటురోగాలు వచ్చే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ నుంచి అనుమతులు లేకుండా కొంతమంది వ్యక్తులు చెరువులో చేపలు పెంచి సొమ్ములు చేసుకుంటున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. చెరువులో అనధికారికంగా పెంచుతున్న చేపలు మృత్యువాత పడటంతో చెరువులోని మంచినీటి బావుల్లోకి కలుషిత నీరు చేరుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి కోనేరులో కలుషితమైన నీటిని వెంటనే తొలగించాలని డిమాండ్‌ చేశారు. లేకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని గ్రామస్తులు హెచ్చరించారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



ధర్మవరంలో బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న మురళీకృష్ణంరాజు

ప్రత్తిపాడు రూరల్‌: మండలంలోని ధర్మవరంలో బాధిత కుటుంబాలను గురువారం వైఎస్సార్‌ సీపీ నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. గ్రామానికి చెందిన సింగులూరి శేఖర్‌ తండ్రి దేవుడు ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని పరామర్శించి మృతికి గల కారణాన్ని అడిగి తెలుసుకున్నారు. సింగులూరి సత్తిబాబు మనవడు వెంకటరమణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఆ కుటుంబాన్ని పరామర్శించి ఆరోగ్యంపై ఆరా తీశారు. ఒక్కో కుటుంబానికి రూ.5 వేలు చొప్పున రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో బొల్లు నాగేశ్వరరావు, తూపాటి బాబ్జి, యాళ్ల ఏసు, జువ్వల ముసలయ్య, రాపా అప్పన, దడాల నాగభూషణం, రాపా రాజేష్‌, వుబా దాసు, డాక్టర్‌ బాబు, బుల్లియ్య, బైరా శ్రీనివాస్‌, మారెళ్ల అప్పన్న బాబు, అంబటి గణేష్‌ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఎమ్మెల్యే ప్రసాద్‌ను సస్పెండ్‌ చేయాలి



సీతంపేటలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న ఎన్‌టీఆర్‌ అభిమానులు

శంఖవరం: సినీ నటుడు జూనియర్‌ ఎన్‌టీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన టీడీపీ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌ను పార్టీ నుంచి సస్పెండ్‌ చేయాలని ప్రత్తిపాడు నియోజక వర్గ ఎన్‌టీఆర్‌ ఫ్యాన్స్‌ అధ్యక్షుడు అమజాల వెంకట రమణ(ఏవీఆర్‌) డిమాండ్‌ చేశాడు. మండలంలోని సీతంపేట కమ్యూనిటీ హాల్లో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌టీఆర్‌ అభిమానులు టీడీపీ పార్టీ గెలుపు కోసం ఎన్నికల్లో కృషి చేశారన్నారు. అనంతపురం అర్బన్‌ నుంచి టీడీపీ తరపున ఎమ్మెల్యేగా గెలుపొందిన దగ్గుపాటి ప్రసాద్‌ ఎన్‌టీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే స్పందించి ఎమ్మెల్యేను పార్టీ నుంచి సస్పెండ్‌ చేయాలని డిమాండ్‌ చేశారు. అనంతరం దగ్గుపాటి ప్రసాద్‌ దిష్టి బొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో జూనియర్‌ ఎన్‌టీఆర్‌ అభిమానులు బి.కృష్ణ, కె.శ్రీను, వి.అర్జున్‌, తాతాజీ, ఎ.శ్రీను, ఎన్‌. నాగ తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్‌ సాయంతో కషాయాల పిచికారీ



కొత్తపల్లిలో డ్రోన్‌ వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయి సిబ్బంది

గోకవరం: ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్న వరి పంటను ఆశిస్తున్న తెగుళ్ల నివారణకు డ్రోన్ల సహాయంతో కషాయాలు పిచికారీ చేస్తున్నామని మండల ఎంఎంటీఎల్‌ బసవన్నగౌడ్‌, ఎంటీ దేవి తెలిపారు. మండలంలో కొత్తపల్లిలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న వరి పొలంలో గురువారం వేపపిండి కషాయం, పాల ఇంగువ, చేపబెల్లం ద్రావణం కలిపి డ్రోన్‌ సహాయంతో పిచికారీ చేశారు. తూర్పుగోదావరి జిల్లాలోని 45 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేయాలనే లక్ష్యంతో ప్రణాళిక రూపొందించినట్టు తెలిపారు. మండలంలో ప్రతి గ్రామంలో రైతులకు కషాయాల పిచికారీ కోసం డ్రోన్‌లను అందుబాటులో ఉంచామన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ యూనిట్‌ ఇంచార్జ్‌ మంగారత్నం, మోడల్‌ మేకర్‌ కె.రమేష్‌, ఐసీఆర్పీ కరుణజ్యోతి, రైతులు పాల్గొన్నారు.

సత్రం కూల్చివేతపై దేవదాయ కమిషనర్‌కు నివేదిక

అన్నవరం: రత్నగిరిపై వీరవేంకట సత్యనారాయణ స్వామి దేవస్థానంలో శిథిలావస్థకు చేరిన సీతారామ సత్రాన్ని కూల్చి వేయాలని జేఎన్‌టీయూకే ప్రొఫెసర్లు ఇచ్చిన నివేదికపై తదుపరి ఉత్తర్వుల కోసం దేవదాయశాఖ కమిషనర్‌ కె.రామచంద్ర మోహన్‌కు ఫైల్‌ పంపించినట్టు దేవస్థానం అధికారులు గురువారం తెలిపారు. అలాగే ఈ సత్రంలోని గదులను భక్తుల వసతికి అద్దెకు ఇవ్వడాన్ని నిలిపివేయాలని అధికారులు ఆలోచిస్తున్నారు. జేఎన్‌టీయూకే ప్రొఫెసర్ల నివేదిక ప్రకారం ఇది కూలిపోయే పరిస్థితిలో ఉన్నందున ఒక వేళ భక్తులు ఈ సత్రంలో బస చేసినప్పుడు కూలిపోతే ప్రాణాపాయం తప్పదని అధికారులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై కూడా స్పష్టత ఇవ్వాలని కమిషనర్‌ను కోరినట్టు అధికారులు తెలిపారు. కాగా జేఎన్‌టీయూకే ప్రొఫెసర్ల నివేదికపై చర్చించి త్వరలోనే ఆదేశాలిస్తామని కమిషనర్‌ చెప్పినట్టు అధికారులు వివరించారు.